క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష



స్టెతస్కోప్‌తో రోగి ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యుడు కల్యాణ్‌బాబు

సంతకవిటి: మండలంలోని మోదుగులపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కల్యాణ్‌బాబు, కోటీశ్వరరావు, వసంతరావు, మండాకురిటి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ ప్రారంభోత్సవం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం నిర్వహించనున్నారు. సర్పంచ్ గార రమణతో పాటు గ్రామస్తులు, దాతలు కలిసి చందాల రూపంలో సేకరించిన రూ.50 లక్షల వ్యయంతో ఈ మందిరాన్ని నిర్మించుకున్నారు. ఖండ్యాం గ్రామానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త అంపోలు రుద్రకోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



నాగావళి నదిలో సీతారాముల ప్రతిమలకు చక్రస్నానాలు చేయిస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో సీతారామస్వామి ఆలయ 19వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ధర్మకర్త కింజరాపు సురేష్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అక్కడి నాగావళి నదిలో సీతారాముల ప్రతిమలకు చక్రస్నానాలు చేయించారు. అనంతరం విగ్రహాల తిరువీధి చేపట్టారు.

జోరుగా ఉపాధి పనులు



ఉపాధి పనుల్లో నిమగ్నమైన వేతనదారులు

రేగిడి: మండలంలో గ్రామగ్రామాన ఉపాధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు మందగించడంతో వేతనదారులకు ఈ పనులు ఆసరాగా నిలుస్తున్నాయి. మండలంలోని ఆర్.ఆమదాలవలస గ్రామంలో ఉన్న ముంగివాని చెరువు వద్ద శుక్రవారం జరిగిన ఉపాధి పనుల్లో మొత్తం 200 మందికి పైగా వేతనదారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పరిశీలన



ఇన్‌ఫిల్టరేషన్ బావులు పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: మండలంలోని భోజరాజపురం గ్రామంలో ఇన్‌ఫిల్టరేషన్ బావులు, అక్కడి మోటార్లను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. వేసవి నేపథ్యంలో పట్టణంలోని ఏ వార్డులోనూ తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాడైన తాగునీటి బోర్లు, మోటార్లను యుద్ధప్రాతిపదికన బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఎక్కడైనా తాగునీటి పైపుల లీకేజీలు కనిపిస్తే వాటిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

కోండ్రు ఎన్నికల సభపై కేసు నమోదు

రాజాం: అనుమతి తీసుకోకుండా వంగర మండలం శివ్వాంలో రెండురోజుల కిందట టీడీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఎన్నికల ప్రచార సభను నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు రాజాం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు శుక్రవారం తెలిపారు. ఏ పార్టీ నేతలైనా ప్రచారాలు, సభలకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని ఎన్నికల డీటీ ప్రకాష్‌రాజ్ తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మెరకముడిదాం: మండలంలోని 17 సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.పావని శుక్రవారం హెచ్చరించారు. కొంతమంది సిబ్బంది ఉదయం విధులకు హాజరై మధ్యాహ్నం ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినట్టు చెప్పి ప్రజలకు అందుబాటులో వుండకుండా వెళ్లిపోతున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇకపై ఇలా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ఎన్ని పార్టీలు కలిసొచ్చినా

వైఎస్సార్ సీపీదే గెలుపు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



పెద్దకోడిశలో ప్రచారంలో ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ తదితరులు

రేగిడి: ఎన్ని పార్టీలు కలిసొచ్చినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే మళ్లీ గెలుపు అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా మండలంలోని రెడ్డిపేట, నాయిరాలవలస, కొత్తచెలికానివలస, కోడిశ, చిన్నకోడిశ, కొండవలస గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. అన్ని ప్రాంతాలతో పాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన అజెండా అని, ప్రజల బాగోగుల కోసం పరితపించే వారిలో ముందు వరుసలో ఆయన ఉంటారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలతో పాటు సదస్సులు, సమావేశాల్లో ఇచ్చిన హామీలను కూడా ఆయన నెరవేర్చారన్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుతం అములోని ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అలాగే విజయనగరం ఎంపీగా మరోసారి పోటీ చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న డాక్టర్ తలే రాజేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, ఎంపీటీసీ కెల్ల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

రాజాం సిటీ: స్థానిక వైఎస్సార్ పార్క్‌ను ఆనుకుని ఉన్న కామాక్షి సమేత ఏకాంబరేశ్వర గోవింద సహిత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి సమయంలో కొంతమంది చోరీకి ప్రయత్నించారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న అర్చకులు శర్మ ఆలయం గేటు సగం తీసి ఉండడాన్ని గమనించి, కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. కమిటీ సభ్యుల సమాచారం మేరకు క్లూస్ టీమ్‌తో కలిసి ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆలయంలోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలోనివి ఏమీ పోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆలయంలో ఉన్నవి ఉన్నట్లు ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. ఏది ఏమైనా రాజాం పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో తరచూ జరుగుతున్న చోరీ ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారింది.

నేడు వాహనాల వేలం

రాజాం సిటీ: మండల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన వేలం వేయనున్నామని సీఐ బి.శ్రీధర్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. హోండా యాక్టివాతో పాటు ఓ ఆటోను వేలంలో ఉంచామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలన్నారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

రాజాం సిటీ: మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు శనివారం నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. రేగిడి మండలంలోని సంకిలి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మూడు మోటార్లలో ఒక మోటార్ మరమ్మతులకు గురికావడంతోనే ఈ అంతరాయం ఏర్పడుతోందని, బాగు చేసిన వెంటనే యథావిధిగా నీటి సరఫరా ఉంటుందన్నారు. ఈ అసౌకర్యాన్ని పట్టణవాసులు గమనించి, సహకరించాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. రాజాం జీసీఎస్‌ఆర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్(జాతీయ సేవా పథకం) సేవా శిబిరం-2 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉనుకూరు పశువైద్యాధికారి బి.రాము అక్కడికి తీసుకువచ్చిన పలు రోగాలతో బాధపడుతున్న పశువుల ఆరోగ్యం తనిఖీ చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పీవో తురంగి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ షెడ్ పాయింట్ కొనసాగించాలి

బొబ్బిలి: రైల్వేస్టేషన్‌లో కొన్ని దశాబ్దాలుగా ఉన్న గూడ్స్ షెడ్ పాయింట్‌ను ఒక్కడే కొనసాగించాలని పట్టణ కలాసీల సంఘ నాయకుడు దంతులూరి వర్మ కోరారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రైల్వే మూడో లైన్ పనుల కారణంగా ఈ ప్రాంతంలోని గూడ్స్ షెడ్‌పాయింట్‌ను తొలగించేందుకు రైల్వే శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారని, ఈ నిర్ణయం మానుకోవాలన్నారు. ఇక్కడి గూడ్స్ షెడ్‌పాయింట్‌లో జరిగే లోడింగ్, అన్‌లోడింగ్ పనులతో 200 మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, అదే షెడ్ పాయింట్ లేకపోతే వారంతా వీధిన పడతారన్నారు. ప్రత్యామ్నాయంగా సాలూరు లైన్‌లో మూడో లైన్ ఏర్పాటు దిశగా ఆలోచన చేయాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వంగర: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీవో కనకదుర్గ అన్నారు. మండలంలోని అరసాడ గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతిరోజూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో టి.కనకదుర్గ తెలిపారు. మండల కేంద్రంలో రేగిడి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన ర్యాలీ చేపట్టి, పౌష్టికాహార ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ తాము తినే రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా మండల ఆర్.డబ్ల్యూ.ఎస్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గతంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు తెలియజేసిన సమస్యలను ఏ మేర పరిష్కరించారన్న దానిపై సమీక్షించారు. సమావేశం దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య పరిష్కారం కావాలని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. వేసవి ఎండల దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో మధుసూదనరావు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సభ్యులంతా ఎన్నికల నియమాలు గ్రామాల్లో సక్రమంగా అమలయ్యేలా అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, పెనుమత్స రమాదేవి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

- ఎంసీసీ సభ్యుల సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ



బొబ్బిలి: ఎంసీసీ సభ్యులతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) సభ్యులతో శుక్రవారం సమావేశమైన ఆమె ఎన్నికల నిబంధనల అమలుపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, హోర్డింగులు తొలగించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని భీమవరం, ముగడ, రేజేరు, గొల్లాది, తెంటువలస, డొంకినవలస గ్రామాల్లో మండల ఏఆర్‌వో ఎస్.రాజారావు, ఎంసీసీ అమలు అధికారి ఆంజనేయులు శుక్రవారం పర్యటించి, ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమలును పరిశీలించారు. రాజకీయ పార్టీలకు చెందిన ఫొటోలు, పేర్లు, పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగించిందీ లేనిదీ గమనించారు. ఎక్కడైనా ఆయా ప్రచార చిత్రాలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని సంబంధిత సిబ్బందిని వారు ఆదేశించారు.



బాడంగి: రేజేరులో ఎన్నికల కోడ్ అమలును పర్యవేక్షిస్తున్న ఎంసీసీ అధికారులు



రామభద్రపురం: సూచనలిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

బొబ్బిలి: మున్సిపల్ కార్యాలయంలో ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) సభ్యులతో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శుక్రవారం సాయంత్రం సమావేశమై, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై పలు సూచనలు చేశారు. ఇదే సమావేశంలో అర్బన్ లెవల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ నిబంధనలు వివరించి, పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: ఎన్నికల నిబంధనల అమలుపై సమీక్షిస్తున్న ఆర్‌వో జోసెఫ్

బొబ్బిలి: మండలంలోని పెంట, కొత్తపెంట, రంగరాయపురం, జె.రంగరాయపురం, ఎం.బూర్జవలస గ్రామాల్లో ఎంపీడీవో పోతుల రవికుమార్ తదితర అధికారులు కలిసి శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పరిశీలించి, ఎక్కడైనా రాజకీయ ప్రచార పోస్టర్లు, బ్యానర్లు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు.

రాజాం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణను సంబంధిత అధికారులంతా బాధ్యతగా తీసుకోవాలని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆయన సమస్యాత్మక గ్రామాలను ముందుగా గుర్తించి, ఆ గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏ ఒక్క ప్రభుత్వ అధికారి రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనకుండా చర్యలు చేపట్టడంతో పాటు నిబంధనలు ఉల్లంఘిస్తే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ బి.ప్రకాష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



● ‘వే’దన తీరింది..

చిత్రంలో కనిపిస్తున్నది.. కునుకువానివలస రోడ్డు. కునుకువానివలస–పెంట జంక్షన్‌ల మధ్య ఉన్న ఈ రోడ్డు గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చాలా అధ్వానంగా తయారైంది. దీంతో అటువైపుగా వెళ్లే బొబ్బిలి, బాడంగి, తెర్లాం, మెరకముడిదాం, దత్తిరాజేరు మండలాల ప్రజలు నానా అవస్థలు పడేవారు. ఇదే సమస్యను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన చొరవతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.25 లక్షల వ్యయంతో 800 మీటర్ల మేర తారురోడ్డు నిర్మించారు. చాలారోజుల తర్వాత తమ వేదన తీరిందని, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ మొర విని, సమస్య పరిష్కరించినందుకు గాను ఎమ్మెల్యే శంబంగికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. – బొబ్బిలి

ఎన్నికల ప్రచారంలో నేతలు



ఉపాధి పనుల ప్రదేశంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్

రేగిడి: ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ తలమునకలయ్యారు. గ్రామగ్రామాన తిరుగుతూ వైఎస్సార్ సీపీకి, తమకు ఓటు వేసి, గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపేట గ్రామానికి వెళ్లిన వారు గ్రామ సమీపంలో దుర్గాశి చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశానికి వెళ్లి, ప్రచారం చేపట్టారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

తెర్లాం: మండలంలోని విజయరాంపురంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దంపతులు ఉదయం కుంకుమ పూజలు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞయాగాదులు చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త బూరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో చేపట్టిన తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చింపేటలో కోదండరామ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు రంపా హనుమంతురావు శర్మ ఆధ్వర్యంలో సర్వదేవతలకు పునఃపూజలు, క్షీరాధివాసం, జలాధివాసం, పంచామృతాభిషేకాలు, లలితా సహస్ర కుంకుమార్చనలు, లింగార్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

నీటిని పొదుపుగా వాడుకోవాలి



వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

రాజాం సిటీ: ప్రజలంతా నీటి ఆవశ్యకతను తెలుసుకుని, పొదుపుగా వాడాలని రాజాం మానవతా సేవా సంస్థ అధ్యక్షులు బి.వి.అచ్యుత్‌కుమార్ సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులకు నీటి ఆవశ్యకత–పొదుపుపై అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో నీటి కొరతను నివారించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పాగిరి పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య విద్యపై అవగాహన

గజపతినగరం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఎమ్ఎల్‌హెచ్‌పీలు అంతా ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని కేర్ క్యాంపెనియన్ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ సాయికృష్ణ రెడ్డి తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో గజపతినగరం మండలం మరుపల్లి పీహెచ్‌సి వద్ద మరుపల్లి, చల్లపేట, దత్తిరాజేరు, కె.కొత్తవలస పీహెచ్‌సీల (ఎమ్ఎల్‌హెచ్‌పీలకు)సిబ్బందికి ఆరోగ్య విద్యపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యంతో ఉన్న రోగులను గుర్తించి వారికి ఆయా కుటుంబ సభ్యులు ఎలా సేవలు అందించాలి, ఏ విధంగా చూసుకోవాలన్న అంశాలపై ఎమ్ఎల్‌హెచ్‌పీలకు వివరించారు. కార్యక్రమంలో కేర్ క్యాంపెనియన్ జిల్లా నోడల్ ఆఫీసర్ సంజయ్, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు అనూజ్ రాయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



ఆరోగ్య విద్యపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ డాక్టర్ సాయికృష్ణారెడ్డి

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం : మండలంలోని మరుపల్లి ఆదర్శ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆరో తరగతిలో చేరేందుకు మార్చి నెల 31 వరకు గడువు ఉందని తెలిపారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష జరగనున్నట్టు పేర్కొన్నారు. మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరం నుంచి 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్ మాత్రమే ఉంటుందని తెలిపారు.